జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 26 3-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.





## ఉద్యమకారులను అవమానించింది

# కేసీఆర్ ప్రభుత్వమే

- జాతిపిత పేరుతో అక్రమాల నుంచి తప్పించుకునే ప్రయత్నం
- నోటీసులిస్తే ప్రజాస్వామ్యానికి విరుద్ధమా? అని ప్రశ్న
- రావి నారాయణ రెడ్డి త్యాగాలకు నేటి పాలకుల తీరుకు తేడా
- కోదండరామ్‌పై దౌర్జన్యం కేసీఆర్ పాలనలోనే జరిగిందన్న ఆరోపణ
- నేరాలకు క్రిమినల్ ఫ్రీడమ్ లేదని స్పష్టం
- విచారణ ప్రజాస్వామ్యంలో తప్పనిసరి అని వ్యాఖ్య

2లో

తెలంగాణ ఉద్యమకారులను అత్యంత దారుణంగా అవమానించిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇటీవలి కాలంలో కొందరు తమను తాము తెలంగాణ జాతిపితలుగా ప్రకటించుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అధికారంలో ఉండి వేల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయల అక్రమ సంపాదనకు పాల్పడి నేరాలు చేస్తే పోలీసుల నోటీసులు రావడం సహజమని అన్నారు. అలాంటి సందర్భంలో

# భారత్‌పై టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ట్రంప్

- మోదీకి ట్రంప్ ఫోన్ కాల్.. "స్టే ట్యూన్డ్" అంటూ అమెరికా రాయబారి పోస్ట్!
- ప్రధాని మోదీతో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- భారత్-అమెరికా వాణిజ్య చర్చల నేపథ్యంలో ఈ సంభాషణ
- "స్టే ట్యూన్డ్" అంటూ ఎక్స్ వేదికగా తెలిపిన యూఎస్ అంబాసిడర్
- విదేశాంగ మంత్రి జైశంకర్ అమెరికా పర్యటన రోజే ఈ పరిణామం
- సంభాషణ వివరాలపై ఇరు దేశాల నుంచి స్పష్టత రావాల్సి ఉంది



భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత్‌పై ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఒప్పందం వెంటనే అమల్లోకి వస్తుందని ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. బదులుగా రష్యా చమురు కొనుగోళ్లు ఆపేస్తామని, అమెరికా చమురు ఉత్పత్తులను భారీగా కొనుగోలు చేస్తామని ప్రధాని మోదీ చెప్పారని వెల్లడించారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ వసూలు చేస్తున్న టారిఫలను దశలవారీగా సున్నాకు తగ్గిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై వేసిన అదనపు 25శాతం సుంకాల అంశాన్ని ట్రంప్ ప్రస్తావించలేదు. కానీ భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ సోమవారం

- మిగతా 2వ పేజీలో

## జోగి రమేష్‌పై కేసు నమోదు..

- లోకేష్ పై వ్యాఖ్యల నేపథ్యంలో కేసు నమోదు చేసిన ఇబ్రహీంపట్నం పోలీసులు..
- జోగి ఇంటిపై దాడి ఘటనపై కూడా కేసు నమోదు చేయనున్న పోలీసులు..
- అజ్ఞాతంలోకి మాజీ మంత్రి జోగి రమేష్..!



2లో



2లో

## కేంద్ర నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు

- కాంగ్రెస్ మోసపూరిత హామీలతోనే ఎన్నికలు గెలిచిందన్న విమర్శ
- రెండేళ్లు దాటినా హామీలు అమలు కాలేదని ఆరోపణ
- కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై బీజేపీ ఛార్జ్‌షీట్
- ఉద్యోగులకు జీతాలు, విద్యవైద్యంపై నిర్లక్ష్యం
- నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్సుమెంట్స్ జాడ లేదు
- కేంద్ర పథకాలు నేరుగా లబ్ధిదారులకే చేరుతున్నాయని స్పష్టం

## టీవీకే ప్రారంభమైంది కన్నీళ్లను తుడవడానికే

- విజయ్ రాష్ట్ర రాజకీయ ప్రముఖులపై తీవ్ర స్థాయిలో దాడి
- తనకు రాజకీయ అనుభవం లేదని ప్రశ్నించిన విమర్శకులకు కూడా సమాధానమిచ్చారు
- డీఎంకే, ఏఐఏడీఎంకేలపై విజయ్ ఫైర్



5లో

## దలైలామా గ్రామీకి చైనా ఆగ్రహం

- 90 ఏళ్ల వయసులో దలైలామాకు అరుదైన గ్రామీ ఘనత
- మతం ముసుగులో రాజకీయ ప్రవాసి అంటూ చైనా ఆరోపణలు
- చైనా వ్యతిరేక అజెండా ప్రచారం చేస్తున్నారని విమర్శ
- శాంతి, కరుణకు లభించిన గౌరవమే గ్రామీ: దలైలామా స్పందన
- ఆడియో బుక్స్ విభాగంలో దిగ్గజాలను వెనక్కి నెట్టి విజయం

2లో

## తెలంగాణను సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నాం



- అభివృద్ధిసంక్షేమానికి వేగం
- సీఎం నేతృత్వంలో పునాది నిర్మాణం
- ప్రజల జీవితాల్లో మార్పు
- అన్ని రంగాల్లో సంస్కరణలు

తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తూ అభివృద్ధి, సంక్షేమం దిశగా వేగంగా ముందుకు తీసుకెళుతున్నామని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఒక్కో ఇటుకను జాగ్రత్తగా పేర్చుకుంటూ, పునాది బలంగా వేసుకుంటూ ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల నమ్మకాన్ని తిరిగి సంపాదించడమే లక్ష్యంగా పాలన కొనసాగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో సమాచార పౌరసంబంధాల శాఖ ఆధునికీకరించిన అధికారిక వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన

- మిగతా 2వ పేజీలో




## తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-1 గనులు కేటాయించాం

- 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు కేటాయించినట్లు వెల్లడి
- రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి స్పందించిన కేంద్రమంత్రి

2లో

## ఉద్యమకారులను అవమానించింది కేసీఆర్ ప్రభుత్వమే

(మొదటి పేజీ తరువాయి)

"జాతిపితను విచారణకు పిలుస్తారా?" అని ప్రశ్నించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని, ఇదే రకమైన అహంకారం, నియంతృత్వమే తెలంగాణ ఉద్యమ విలువలకు పూర్తి విరుద్ధమని రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి "రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవం" సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ చరిత్ర, ఉద్యమాల స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువలు, నేటి రాజకీయ వికృతులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమం త్యాగాలు, సిద్ధాంతాలు, ప్రజల కోసం సాగిన పోరాటాల ఫలితమని, వ్యక్తి ఆరాధనల ఫలితం కాదని స్పష్టం చేశారు. పద్మ విభూషణ్ దివంగత రావి నారాయణ రెడ్డి స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే అధిక మెజార్టీతో పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించి చరిత్ర సృష్టించిన నాయకుడు రావి నారాయణ రెడ్డని గుర్తు చేశారు. ఆయనకు లభించిన అపార ప్రజాదరణను గౌరవిస్తూ, పార్లమెంట్ భవనాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభింపజేసిన ఘనత నెహ్రూకే దక్కిందన్నారు. ప్రజాదరణకు తల వంచే రాజకీయ సంస్కృతి అప్పట్లో ఉండేదని, నేడు అది పూర్తిగా కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం, స్వేచ్ఛస్వాతంత్రాల కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటానికి రావి నారాయణ రెడ్డి నాయకత్వం వహించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కమ్యూనిస్టు ఉద్యమ నేతగా ప్రజల కోసం వీధుల్లో, చట్టసభల్లో చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం ప్రపంచ చరిత్రలోనే నిలిచిపోయే ఘట్టమని పేర్కొన్నారు. ప్రజల హక్కులు కాలరాయబడితే తిరుగుబాటు తప్పదని, అణచివేతలు సాయుధ పోరాటాలకు దారి తీస్తాయని రావి నారాయణ రెడ్డి చేసిన హెచ్చరికలు నేటికీ ప్రాసంగికమేనని అన్నారు. 60 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత ఎన్నికల రాజకీయాలకు స్వచ్ఛందంగా వీడ్కోలు చెప్పి అన్ని పదవుల నుంచి తప్పుకున్న రావి నారాయణ రెడ్డి యువతరానికి ఆదర్శంగా నిలిచారని సీఎం గుర్తు చేశారు. ప్రజల మద్దతు ఉన్నప్పుడే అధికారాన్ని వదిలేయడం అంటే ఏమిటో ఆయన చేతల ద్వారా చాటిచెప్పారన్నారు. కానీ నేటి రాజకీయాల్లో ప్రజలు వరుసగా ఓడించినా పదవులను వదలని నేతలను చూస్తున్నామని, ప్రజలే తప్పు చేశారని చెప్పే అహంకారాన్ని చూస్తున్నామని తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల కాలంలో ఎవరికి వారు తెలంగాణ జాతిపితలమంటూ ప్రచారం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. నేరాలకు పాల్పడి విచారణకు నోటీసులు వస్తే ఉద్యమకారులను అవమానిస్తున్నారని ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. చేసిన తప్పులకు విచారణ ఎదుర్కోవడం ప్రజాస్వామ్యంలో తప్పనిసరి అని, అధికారంలో ఉండి అక్రమాలకు పాల్పడి ఇప్పుడు బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూడటం దొంగ రాజకీయమని విమర్శించారు. "మేం ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి విచారణ చేయాలి" అని చెప్పడం ఎలాంటి జాతిపిత లక్షణమని ఎద్దేవా చేశారు.

## దలైలామా గ్రామీకి చైనా ఆగ్రహం

టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు ప్రతిష్టాత్మక 'గ్రామీ అవార్డు' లభించడంపై చైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 90 ఏళ్ల వయసులో దలైలామా ఈ అరుదైన ఘనతను సాధించడం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నప్పటికీ, చైనా మాత్రం తీవ్ర విమర్శలతో స్పందించింది. ఈ పరిణామాన్ని రాజకీయ కోణంలోకి మళ్లిస్తూ, దలైలామాను "మతం ముసుగులో ఉన్న రాజకీయ ప్రవాసి"గా చైనా అభివర్ణించింది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ మీడియాతో మాట్లాడుతూ, దలైలామా ఆధ్యాత్మిక నేత కాదని, చైనాను విడదీయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న వేర్పాటువాది అని ఆరోపించారు. ఇలాంటి అంతర్జాతీయ అవార్డులను అడ్డుపెట్టుకుని చైనా వ్యతిరేక అజెండాను ప్రచారం చేస్తున్నారని, ఇది అసహ్యకరమని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వేదికలు చైనా వ్యతిరేక శక్తులకు మద్దతు ఇవ్వకూడదని హెచ్చరించడం గమనార్హం. దలైలామాకు లభించిన గ్రామీ అవార్డును కూడా రాజకీయ ప్రయోజనాల కోసమే ఉపయోగిస్తున్నారని చైనా ఆరోపించింది. అయితే ఈ విమర్శలకు దలైలామా స్పందిస్తూ, గ్రామీ అవార్డును తాను వ్యక్తిగత విజయంగా భావించడం లేదని స్పష్టం చేశారు. ఈ గౌరవం శాంతి, కరుణ, అహింస, మానవతా విలువలకు లభించిన గుర్తింపుగా తాను చూస్తున్నానని తెలిపారు. ప్రపంచం ప్రస్తుతం విభజనలతో నిండిపోయిన సమయంలో, మానవత్వం, పర్యావరణంపై ప్రేమ, పరస్పర గౌరవం అత్యంత అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. సంగీతం, కళలు, కథనాల ద్వారా మంచి విలువలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తాయన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-1 గనులు కేటాయించాం

బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించడం లేదన్న తమిళనాడు ఎంపీ తాడిచెర్ల-1 బొగ్గు గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు దీనిని కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం అనంతరం, 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారినట్లు తెలిపారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి కేంద్రమంత్రి స్పందించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, ఇది తెలంగాణ ప్రజలను నిరాశపరిచిందని అన్నారు. 2020 జూన్ నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లు కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై అన్నారు. వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రైవేటు రంగ కొనుగోలుదారులకు కట్టపెడుతున్నారని ఆరోపించారు. దీంతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచెర్ల-1 బొగ్గు గనులను కేటాయించినట్లు తెలిపారు.

## భారత్‌పై టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

రాత్రి జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌పై సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించినట్టుగా వెల్లడించారు. మరోవైపు సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 18శాతానికి సుంకాలను తగ్గించడంపై ట్రంప్‌కు 140 కోట్ల మంది భారతీయుల తరపున కృతజ్ఞతలు చెబుతున్నట్టు ప్రకటించారు. అయితే రష్యా చమురు కొనుగోళ్ల నిలిపివేత తదితర అంశాలు వేటినీ మోదీ ప్రస్తావించలేదు. అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై భారత్ భారీగా సుంకాలు విధిస్తోందంటూ గతేడాది జూలైలో 25శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్.. తర్వాత రష్యా నుంచి వద్దన్న చమురు కొంటోందంటూ ఆగస్టులో సుంకాలను 50శాతానికి పెంచిన విషయం తెలిసిందే.దసోమవారం ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారు. భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్'లో తొలుత ఈ విషయాన్ని వెల్లడించారు. తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. "నా గొప్ప స్నేహితుల్లో ఒకరు, శక్తివంతమైన నేత ప్రధాని మోదీతో మాట్లాడాను. వాణిజ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడం సహా చాలా అంశాలపై చర్చించాం. రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేసేందుకు.. అమెరికా నుంచి, ముఖ్యంగా వెనెజువెలా నుంచి భారీగా చమురు కొనుగోలు చేసేందుకు మోదీ అంగీకరించారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు ఇది తోడ్పడుతుంది. మిత్రుడు మోదీ విజ్ఞప్తి మేరకు, ఆయనపై గౌరవంతో.. యూఎస-భారత్ వాణిజ్య ఒప్పందానికి అంగీకరించాం. ఇది వెంటనే అమల్లోకి వస్తుంది. భారత్‌పై అమెరికా ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నాం. బదులుగా అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలను క్రమంగా సున్నాకు తగ్గిస్తుంది. వాణిజ్య అడ్డంకులను తొలగిస్తుంది. రూ.45.5 లక్షల కోట్ల (500 బిలియన్ డాలర్ల) విలువైన అమెరికా చమురు, బొగ్గు, సాంకేతిక, వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుంది. దీనికి అదనంగా వీలైనంత ఎక్కువగా అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. భారత్‌తో మా బంధం మరింత బలోపేతం అవుతుంది. ప్రధాని మోదీ, నేను ఇద్దరం గొప్ప పనులు పూర్తి చేశాం" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మూడు రోజుల పర్యటన కోసం సోమవారం వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అరుదైన ఖనిజాల సరఫరాకు సంబంధించిన సమావేశంలో పాల్గొననున్నారు. భారతీయ సైనిక అమరులకు గుర్తుగా ఢిల్లీలో ఠీవిగా నిలబడిన 'ఇండియా గేట్'పై ట్రంప్ కన్ను పడింది. అలాంటిది తమకూ కావాలని అనిపించింది. ట్రంప్ స్వయంగా దీనిపై ట్రూత్ సోషల్‌లో ఇండియా గేట్ ఫొటోతో పోస్టు పెట్టారు. "ఇది భారత్ విజయ ద్వారం. మేం కట్టబోయేది ఇలాంటి వాటన్నింటికన్నా గొప్పగా ఉంటుంది" అని పేర్కొన్నారు. తర్వాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో




మాట్లాడుతూ.. ప్రపంచంలో చాలా నగరాలకు విజయ ద్వారాలు ఉన్నాయని.. గొప్ప దేశమైన అమెరికాలోని వాషింగ్టన్‌లో మాత్రం లేదని పేర్కొన్నారు. పారిసలోని 'ఆర్క్ డె ట్రయంఫీ' తరహాలో ప్రపంచంలోనే గొప్పగా, అందంగా వాషింగ్టన్‌లో విజయ ద్వారాన్ని నిర్మిస్తామని చెప్పారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదట ప్రకటించడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ సెటైర్లు వేశారు. "ఆపరేషన్ సిందూర్ ఆగినప్పుడు, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి.. ఇప్పుడు వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా నుంచి ట్రంపే మొదట ప్రకటించారు. ట్రంప్‌తో మోదీ మాట్లాడిన విషయాన్ని కూడా అమెరికా రాయబారి ప్రకటించారు

## కేంద్ర నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోసమే రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఎన్నికలను ముందుకు తెచ్చిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిన కాంగ్రెస్, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసిందని రామచందర్ రావు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా, ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు సాధించిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని ప్రభుత్వానికి ప్రజలపై మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని తీరుపై బీజేపీ ఛార్జ్‌షీట్ విడుదల చేసినట్లు రామచందర్ రావు తెలిపారు. ఈ ఛార్జ్‌షీట్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకువచ్చామని అన్నారు. రెండు సంవత్సరాల పాలనలో రాష్ట్రానికి, ప్రజలకు కాంగ్రెస్ చేసింది ఏమిటో స్పష్టంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పాలనలో అనుభవం లేకపోవడం, అవినీతి, అసమర్థత కారణంగా రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామచందర్ రావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులు కుటుంబాలు పోషించుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వానికి తగిన ప్రవర్తన కాదని, ఉద్యోగులను దాసోహం చేసుకునే విధంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని విమర్శలు గుప్పించారు. విద్య, వైద్య రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని రామచందర్ రావు ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సరైన వసతులు లేకుండా అస్తవ్యస్తంగా మారాయని అన్నారు. వైద్య రంగంలో ఆసుపత్రుల్లో సౌకర్యాల కొరత, మందుల లేమి, సిబ్బంది సమస్యలు తీవ్రమయ్యాయని చెప్పారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఈ రెండు రంగాల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగులకు ఇస్తామని హామీ ఇచ్చిన రూ.4 వేల నిరుద్యోగ భృతి జాడే లేదని రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం, కనీసం హామీ ఇచ్చిన భృతిని కూడా అమలు చేయలేకపోయిందని విమర్శించారు. యువతలో పెరుగుతున్న నిరాశకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్సుమెంట్స్ కూడా సకాలంలో ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఫీజుల భారం తట్టుకోలేక విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేస్తున్నారని చెప్పారు. విద్యను ప్రోత్సహిస్తామని చెప్పిన కాంగ్రెస్, వాస్తవంలో విద్యార్థులను దోచుకుంటోందని ఆరోపించారు. ఇక కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతున్నాయని రామచందర్ రావు స్పష్టం చేశారు. పారదర్శకతతో, అవినీతి లేకుండా కేంద్ర పథకాలు అమలవుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా, కేంద్రం ప్రజల సంక్షేమం కోసం నిధులు విడుదల చేస్తోందని చెప్పారు.

## జోగి రమేష్‌పై కేసు నమోదు..

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌పై మరో కేసు నమోదు చేశారు పోలీసులు.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. ఈ పరిణామాల మధ్య జోగి రమేష్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. లోకేష్‌తో పాటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో జోగి రమేష్‌పై చర్యలు తీసుకునే అవకాశముందని సమాచారం రావడంతో, ఆయన్ను అరెస్ట్ చేయవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే కారణంతో ఆయన ప్రస్తుతం పోలీసులకు అందుబాటులో లేకుండా ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో జోగి రమేష్ నివాసంపై జరిగిన దాడి ఘటనపై కూడా పోలీసులు మరో కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం. ఈ ఘటనలో టీడీపీ శ్రేణుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. జోగి వ్యాఖ్యలు, ఆయన ఇంటిపై దాడి ఘటన.. ఈ రెండు అంశాలపై వేర్వేరు కేసులు నమోదు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిన్న రాత్రి తిరుపతి నుంచి విజయవాడకు వచ్చిన జోగి రమేష్, పరామర్శ నిమిత్తం వచ్చిన నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగమోహన్ రావుతో కలిసి రాత్రి సుమారు 1.30 గంటల సమయంలో తన నివాసం నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఆయనతో పాటు ఆయన తనయుడు రాజీవ్ కూడా వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి జోగి రమేష్ అజ్ఞాతంలోకి వెళ్లారని పోలీసులు అనుమానిస్తున్నారు.



## తెలంగాణను సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నాం: పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, ప్రభుత్వ పనితీరును ప్రజలకు పారదర్శకంగా చేరవేసేందుకు సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాచార విభాగం ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధిగా పనిచేస్తుందని, ఆ బాధ్యతను మరింత బలోపేతం చేయాల్సిన సమయం ఇదేనని అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి విధాన నిర్ణయం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకొస్తోందని మంత్రి పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన సంక్షేమ పథకాలను తిరిగి పట్టాలెక్కించామని, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని స్థిరత్వం వైపు నడిపిస్తున్నామని అన్నారు. సంక్షోభాల మధ్య కూడా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతులకు మేలు చేసే విధానాలను అమలు చేస్తూ, సాగునీరు, పంటల మద్దతు ధరలు, ఇన్‌పుట్ సబ్సిడీల వంటి అంశాల్లో సమగ్ర దృష్టితో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రైతు ఆర్థిక స్థితి మెరుగుపడితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్న అవగాహనతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. విద్య రంగంలోనూ విస్తృత సంస్కరణలు అమలవుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. విద్యార్థులకు భవిష్యత్తు నిర్మాణానికి అవసరమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అలాగే వైద్య రంగంలో ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. గృహ నిర్మాణం, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పేదలకు ఇల్లు, ఆకలిలేని జీవితం, సామాజిక భద్రత కల్పించడమే సంక్షేమ ప్రభుత్వ అసలైన లక్షణమని అన్నారు. గతంలో నిలిచిపోయిన పథకాలను పునఃప్రారంభించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఉపాధి కల్పన ప్రభుత్వానికి మరో కీలక అంశమని మంత్రి అన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఉద్యోగాలు, ఉపాధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదన్న స్పష్టతతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా సమాచార శాఖ అధికారులను ఉద్దేశించి మంత్రి కీలక సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు సమయానుకూలంగా, స్పష్టంగా చేరేలా సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మరింత చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రజలకు చేరితేనే పాలనపై నమ్మకం పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.



## చౌటుప్పల్ మున్సిపాలిటీలో 2వ రోజు 13 నామినేషన్ల ఉపసంహరణ

**మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి**

**చౌటుప్పల్, ఫిబ్రవరి 2 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ రెండో రోజున మొత్తం 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ వార్డుల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఉపసంహరణ పత్రాలను సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉపసంహరణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని వివరించారు. నామినేషన్లను ఉపసంహరించుకున్న వారిలో 2వ వార్డు నుంచి పెద్దగోని పారిజాత, 3వ వార్డు నుంచి పర్నే ప్రవీణ, పర్నే రజిత, 7వ వార్డు నుంచి వెన్‌రెడ్డి సంధ్య, 8వ వార్డు నుంచి నందగిరి భీమయ్య, 9వ వార్డు నుంచి గోశిక నరసింహ, వనం ధనంజయ, 11వ వార్డు నుంచి వెన్‌రెడ్డి సంధ్య, 12వ వార్డు నుంచి బొంగు మహేష్, 16వ వార్డు నుంచి బత్తుల వాణి, 18వ వార్డు నుంచి పుడుత మంజుల, 19వ వార్డు నుంచి మోగుదాల రమేష్, సుర్వి మానస ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ఫిబ్రవరి 03 సాయంత్రానికి అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి

**నూతన వి.బి.జీ రామ్ జీ బిల్లును ఉపసంహరించుకోవాలి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి**



**వలిగొండ, ఫిబ్రవరి 2 (తొలివెలుగు):** వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా 2005 ఫిబ్రవరి 2న యూపీఏ-1 ప్రభుత్వం వామపక్ష పార్టీల మద్దతుతో ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను బీజేపీ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. సోమవారం వలిగొండ మండలం సుంకిశాల గ్రామంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం పేరును మార్చడం, కూలీలకు ఉన్న అనేక హక్కులను తొలగించేలా నూతన వి.బి.జీ రామ్ జీ బిల్లును తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ పథకాన్ని కాపాడుకునేందుకు కార్మికులతో ప్రతిజ్ఞ చేయించినట్లు పేర్కొన్నారు. 2005లో ప్రారంభమైన ఉపాధి హామీ పథకం 2006 నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా కోట్లాది పేదల జీవితాలకు ఆధారంగా నిలిచిందని సిర్పంగి స్వామి అన్నారు. ఈ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగిస్తూ సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొండే కిష్టయ్య, రైతు సంఘం మండల నాయకులు మంగ బాలయ్య, మండల ఉపాధ్యక్షులు కొండూరు సత్తయ్య, స్థానిక వార్డు సభ్యులు ఈర్లపల్లి నరసింహ, కాటేపల్లి వనజ, నాయకులు ఇతాప నగేష్, కాటేపల్లి వెంకటేశం, పోలేపల్లి స్వామి, మంగ శ్రీను, పోలేపల్లి ఉప్పలయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### టీఆర్‌పీ నుంచి బీఫారం అందుకున్న గట్టు మొగలయ్య ముదిరాజ్

**5వ వార్డులో కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి**



**చౌటుప్పల్, ఫిబ్రవరి 2 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ (తంగడపల్లి) పరిధిలోని 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరఫున గట్టు మొగలయ్య ముదిరాజ్ బీఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) చేతుల మీదుగా బీఫారం అందజేశారు. వార్డు పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన నాయకులు, చౌటుప్పల్ మున్సిపాలిటీలో మార్పు కోరుకునే ప్రజలు 5వ వార్డులో కత్తెర గుర్తుపై ఓటు వేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థి గట్టు మొగలయ్య ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధగాని హరి శంకర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ ఇంచార్జ్ వట్టే జానయ్య యాదవ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నరసయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు తిరుమణి నాగరాజు గౌడ్, జెట్ట కృష్ణ, వేణు కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

**కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి**

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**



**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 2 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా పట్టణంలోని 9వ, 10వ వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా ఆయన గడపగడపకు వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకొని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గత పాలనలో జరిగిన లోపాలను ప్రజలకు గుర్తు చేస్తూ, ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న ప్రజాపాలన ద్వారా అన్ని వర్గాలకు సమాన న్యాయం జరుగుతోందని తెలిపారు. స్థానికంగా కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తే పట్టణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## ఏకగ్రీవంగా చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం కార్యవర్గం ఎన్నిక



**చౌటుప్పల్, ఫిబ్రవరి 2 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు సమావేశమై ఫోరం అధ్యక్షుడిగా అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మండల సర్పంచుల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఏర్పడిన ఈ ఫోరం కార్యవర్గంలో కీలక బాధ్యతలను పలు సర్పంచులకు అప్పగించారు. ఉపాధ్యక్షులుగా కాకి శ్రీలత, టేకుల మంజులలను ఎంపిక చేయగా, కోశాధికారిగా కైరంకొండ స్వప్న, ప్రధాన కార్యదర్శిగా తంగెళ్ళ వెంకటేశం, సహాయ కార్యదర్శులుగా అన్యాలపు నరేష్, గుండెబోయిన శిరీషలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పూర్తి మద్దతు ప్రకటించారు. తూప్రాన్‌పేట, దండుమల్కాపురం, పంతంగి, ఖైతాపురం, కుంట్లగూడెం, జైకేసారం, పెద్దకొండూరు, ఎనగండితండా, ఆరెగూడెం, గుండ్లబావి, అల్లాపురం, కొయ్యలగూడెం, కాట్రేవు, మందోళ్లగూడెం గ్రామాల సర్పంచులు ఏకాభిప్రాయంతో మద్దతు తెలిపినట్లు వెల్లడించారు. ఎంపికైన నూతన కార్యవర్గ వివరాలను ధృవీకరిస్తూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండల అభివృద్ధికి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## లింగోజిగూడెం 3వ వార్డులో 'గడప గడపకు' ప్రచారం

**ఆదరించండి.. అభివృద్ధి చేస్తాం**

**'చేయి' గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించండి: పల్లె లావణ్య సురేందర్ రెడ్డి**



**చౌటుప్పల్, ఫిబ్రవరి 2 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగోజిగూడెం గ్రామం 3వ వార్డులో సోమవారం కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పల్లె లావణ్య సురేందర్ రెడ్డి 'గడప గడపకు' ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను నేరుగా కలుసుకుని, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతోందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు వంటి హామీలు ఇప్పటికే అమలులోకి వచ్చాయని వివరించారు. వార్డు సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆమె, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 'చేయి' గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## చౌటుప్పల్ మున్సిపాలిటీ 20 వార్డుల కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

**జాబితాను విడుదల చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్, ఫిబ్రవరి 2 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 20 వార్డులకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను పార్టీ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సోమవారం ప్రకటించారు. పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రకటించిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. 1వ వార్డు నుంచి కోసనం రాకేష్ రెడ్డి (ఓసీ రెడ్డి), 2వ వార్డు నుంచి సుర్వి మంజుల నర్సింహ గౌడ్ (బీసీ గౌడ్), 3వ వార్డు నుంచి పల్లె లావణ్య సురేందర్ రెడ్డి (ఓసీ రెడ్డి), 4వ వార్డు నుంచి ఇప్ప వెంకటేష్ (ఎస్సీ మాదిగ), 5వ వార్డు నుంచి కొండూరి ధర్మేందర్ (బీసీ గౌడ్), 6వ వార్డు నుంచి రావుల వసంత స్వామి (బీసీ రజక), 7వ వార్డు నుంచి కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి (ఓసీ రెడ్డి), 8వ వార్డు నుంచి బద్రి గాలయ్య (ఎస్సీ మాదిగ) ఉన్నారు. అదేవిధంగా 9వ వార్డు నుంచి మొగుదాల పావని రమేష్ గౌడ్ (బీసీ గౌడ్), 10వ వార్డు నుంచి దేప రమ్య రాజు (బీసీ ముదిరాజ్), 11వ వార్డు నుంచి గోశిక వినయ్ కుమార్ (బీసీ పద్మశాలి), 12వ వార్డు నుంచి పాక చిరంజీవి (బీసీ యాదవ్), 13వ వార్డు నుంచి బత్తుల వాణి విప్లవ్ (బీసీ గౌడ్), 14వ వార్డు నుంచి ఊడుగు జ్యోతి రమేష్ (బీసీ గౌడ్), 15వ వార్డు నుంచి అంతటి విజయలక్ష్మి బాలరాజు (బీసీ గౌడ్), 16వ వార్డు నుంచి వెన్ రెడ్డి సంధ్య రాజు (బీసీ మున్నూరు కాపు)గా ప్రకటించారు. మిగిలిన వార్డులలో 17వ వార్డు నుంచి పస్తం మల్లమ్మ గంగరాములు (ఎస్సీ బుడగ జంగాలు), 18వ వార్డు నుంచి గుగులోతు అరుణ శంకర్ నాయక్ (ఎస్టీ బంజారా), 19వ వార్డు నుంచి పిల్లలమర్రి మధుసూదన్ (బీసీ పద్మశాలి), 20వ వార్డు నుంచి మహమ్మద్ హాన్ను (ముస్లిం మైనార్టీ)గా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



## వైకాపా నేతలపై తెదేపా నిరసన

**చంద్రబాబు నాయుడిపై అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆందోళన**

**వైసీపీ నేతల దిష్టిబొమ్మల దహనం**

**చౌటుప్పల్, ఫిబ్రవరి 2 (తొలివెలుగు):** చౌటుప్పల్ మండల తెలుగుదేశం పార్టీ మున్సిపల్, మండల శాఖల ఆధ్వర్యంలో సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై అసభ్యంగా, అగౌరవంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ మంత్రి, మాజీ శాసనసభ స్పీకర్ అంబటి రాంబాబు, మాజీ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ జాతీయ రహదారిపై వారి దిష్టిబొమ్మలను దహనం చేస్తూ టీడీపీ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతాయుత పదవుల్లో ఉన్న వ్యక్తులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని, వెంటనే వారు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మునుగోడు నియోజకవర్గ మాజీ కోఆర్డినేటర్ బడుగు లక్ష్మయ్య, మండల అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి వర్కాల వెంకటేశం గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు సుంకరి జంగయ్య గౌడ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి సిలువేరు రాజు పాల్గొన్నారు. అలాగే మండల ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్, మారవుని అశోక్ గౌడ్, ప్రచార కార్యదర్శి గోగినేని కృష్ణ తేజతో పాటు పార్టీ నాయకులు బొంగు బాద్షా, ఉపేంద్ర చారి, చెరుకు అశోక్, అంతటి కిష్టయ్య, గుర్రం యాదగిరి, ఆంజనేయులు, గోశిక పాండు, గొల్లపూడి దినేష్, కొమ్మరల సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 4న మిర్యాలగూడకు సీఎం రేవంత్ రెడ్డి

**ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలి: జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



**మిర్యాలగూడ :** ఈనెల 4వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడ మండల పర్యటన నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి మిర్యాలగూడ సమీపంలోని గూడూరు శివారులో ఏర్పాటు చేయనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. బహిరంగ సభ వేదిక, సభకు హాజరయ్యే ప్రజలకు సరిపడా కుర్చీలు, తాగునీరు, బ్యారికేడింగ్, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలు తదితర సౌకర్యాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే బహిరంగ సభకు వచ్చే అప్రోచ్ రోడ్లు, హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వివిధ శాఖలకు కేటాయించిన విధులను తూచా తప్పకుండా పాటించాలని, సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఆర్ అండ్ బి ఈఈ శ్రీధర్ రెడ్డి, డీపీఓ శంకర్ నాయక్, స్థానిక మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.





## పదేళ్లు పత్తాలేరు.. ఇప్పుడొచ్చి దండాలు పెడుతున్నారా?"

**పేదోళ్లకు రేషన్ కార్డు ఇవ్వనోళ్లు.. ఓట్లడిగేందుకు ఏ ముఖం పెట్టుకొస్తున్నారు?**

**మిమ్మల్ని ముంచింది 'కారు' సర్కారు.. గట్టెక్కించేది 'హస్తం' ప్రభుత్వమే!**

**ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార హోరులో గులాబీ నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు!**



**ఖమ్మం :** ఏదులాపురం మున్సిపాలిటీ : "పదేళ్ల పాటు ప్రజలను గాలికొదిలేసి.. ఇవాళ ఎన్నికలు రాగానే దండాలు పెట్టుకుంటూ వస్తున్న నాయకులను నమ్ముదామా? పేదోడికి ఓ రేషన్ కార్డు ఇవ్వడానికి మనసు రాని వాళ్లకు మళ్లీ ఓట్లు వేయాలా?" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గులాబీ నేతలపై విరుచుకుపడ్డారు. సోమవారం ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2, 22, 23, 24, 26, 27వ వార్డుల్లో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన ప్రసంగం ఆద్యంతం వాడివేడిగా సాగింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ సంక్షేమం అర్హుల దరిచేరకుండా వారిని నమ్మించి మోసం చేసిన ఘనత ముమ్మాటికీ వారిదేనని ఎద్దేవా చేశారు. ఇప్పుడు తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

**గాలి మోటార్ల నాయకులకు.. గల్లీ కష్టాలేం తెలుసు?**

గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తనదైన శైలిలో సెటైర్లు వేశారు. "నాడు ఫామ్ హౌస్‌లకే పరిమితమై, గాలి మోటార్లలో తిరిగిన నాయకులకు.. ఈ గల్లీల్లో డ్రైనేజీలు పొంగుతుంటే, ఇళ్లు మునుగుతుంటే ఏనాడైనా కనిపించాయా?" అని నిలదీశారు. రాజీవ్ గృహకల్ప వాసులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని వారు, ఇవాళ ఎన్నికల కోసం కొత్త నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు ఇచ్చి ఆకలి తీర్చామని, అది కాంగ్రెస్ మార్కు పాలన అని చెప్పారు.

**ముంపు కష్టాలకు 'రిటైనింగ్' చెక్!**

మాట ఇస్తే మడమ తిప్పే అలవాటు తనకు లేదన్నారు... జూన్ కల్లా కరకట్ట పూర్తి చేసి మీ ముంపు కష్టాలు తీర్చి తీరుతా" అని మంత్రి మరోమారు హామీ ఇచ్చారు. రూ. 690 కోట్లతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ ఏదులాపురానికి రక్షణ కవచంలా మారుతుందని, రాజీవ్ గృహకల్ప ఇళ్లకు కొత్త హంగులు అద్దడంతో పాటు ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇచ్చే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కలిపి సుమారు రూ.308 కోట్లతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని, ఏదులాపురాన్ని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అభివృద్ధి కావాలంటే హస్తం గుర్తుకే ఓటేయాలని, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పొంగులేటి పిలుపునిచ్చారు.

## వివాహేతర సంబంధం.. దారుణం..

**తల్లీబిడ్డలను సజీవ దహనం చేసిన కిరాతకురాలు**

**వివరాలు వెల్లడించిన నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు..**

**నాంపల్లి:** నాంపల్లి మండలం, కేతపల్లి గ్రామంలో జనవరి 31న జరిగిన దారుణ హత్య ఉదంతం విషాదాంతమైంది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందన్న కోపంతో ఓ మహిళ, మరో మహిళతో పాటు ఆమె పసికందును కూడా, పెట్రోల్ పోసి నిప్పంటించి, చంపిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలు మీసాల సుజాత, సోమవారం పోలీసుల ఎదుట లొంగిపోయింది.

**అసలేం జరిగింది..!?**

పోలీసుల ఇంటరాగేషన్‌లో వెల్లడైన వివరాల ప్రకారం.. నిందితురాలు సుజాతకు అదే గ్రామానికి చెందిన నగేష్ యాదవ్ తో, గత కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం నగేష్ భార్య మమతకు తెలియడంతో, కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరిగాయి. పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా, నగేష్ తన తప్పు తెలుసుకుని సుజాతను దూరం పెట్టాడు. భార్యాపిల్లలతో కలిసి సంతోషంగా ఉంటున్న నగేష్, సుజాత ఫోన్ కాల్స్ కూడా ఎత్తడం మానేశాడు.

**పక్కా ప్లాన్‌తో ఘాతుకం**

నగేష్ తనను దూరం పెట్టడానికి మమతయే కారణమని భావించిన సుజాత, ఆమెను వదిలించుకుంటేనే నగేష్ తనకు దక్కుతాడని పథకం వేసింది. ఈ క్రమంలో జనవరి 31న ఒక బాటిల్‌లో పెట్రోల్ కొనుగోలు చేసింది. కేవలం పెట్రోల్‌తో పని కాకపోతే ఎలా అనే అనుమానంతో, ఒక సంచిలో కత్తి, కారంపొడిని కూడా వెంట తీసుకెళ్లింది.

మమత ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో, సుజాత ఒక్కసారిగా ఆమెపై పెట్రోల్ పోసి నిప్పు అంటించింది.

**చిన్నారిని కూడా వదలని వైనం**

ఈ ఘోర సంఘటనలో మమతతో పాటు, ఆమె చంకలో ఉన్న చిన్న కుమారుడు అద్విక్ నందన్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. మమత అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, కుటుంబ సభ్యులు బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. కేవలం తన స్వార్థం కోసం పసి ప్రాణాన్ని కూడా బలితీసుకున్న, సుజాత తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు  కేవలం నగేష్‌ను తన వశం చేసుకోవాలనే ఉద్దేశంతోనే, ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితురాలిని కోర్టులో హాజరుపరిచి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నామని, నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు వెల్లడించారు.



## ఉపాధికి ఊరేసిన మోడీ ప్రభుత్వం



**భువనగిరి:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తుల, గ్రామీణ ధనిక వర్గాల ప్రయోజనాల కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ఊరేసి, ప్రజల హక్కుగా ఉన్న పనిని వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే విధంగా విబి-జి రామ్ జి చట్టాన్ని తెచ్చారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా విమర్శించారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం పాత నరేగా చట్టాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేసినారు.  సోమవారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి, మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ ఉపాధి హామీ కార్మికులతో కలిసి " నిరసన" కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ భారతంలో కుల, మత, లింగ బేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు వారి జీవన హక్కులను బలోపేతం చేయడానికి వామపక్ష పార్టీల ఒత్తిడి మేరకు 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ వన్ ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా కోట్లాదిమంది కూలీలకు స్వ గ్రామంలోని ఉపాధి లభించిందని ఆకలి బాధలు, వలసలు తగ్గాయని ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని, మహిళల ఆర్థిక గౌరవాన్ని బలోపేతం చేసిందని అన్నారు. 2008లో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం వచ్చినప్పటికీ దాని ప్రభావం గ్రామీణ భారతంపై పెద్దగా పడలేదని కరువుల్లోనూ, కరోనా సమయంలోను గ్రామీణ ప్రజలను ఉపాధి హామీ చట్టము ఆదుకుందని తెలిపారు. అలాంటి చట్టానికి మోడీ సర్కారు 10 ఏళ్లుగా తూట్లుబొడుస్తూ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్రలో భాగంగా జి రామ్ జి చట్టాన్ని తెచ్చారని అన్నారు. 40 శాతం నిధులు రాష్ట్రాలు భరించాలని నిబంధన మోడీ సర్కార్ తీసుకొచ్చిందని, 40 శాతం రాష్ట్రాలు ఖర్చు పెడితేనే 60% నిధులు కేంద్రం బరిస్తుందని మెలిక పెట్టానని విమర్శించారు. 125 రోజులకు ఉపాధి పనిని పెంచామని చెప్తున్న మోడీ ప్రభుత్వం దీనిని అమలు చేయాలంటే బడ్జెట్లో రూ.3 లక్షల కోట్లు కేటాయించవలసి ఉండగా కేవలం రూ. 95 వేల కోట్లకే పరిమితం చేసిందని విమర్శించారు. వీరు కేటాయించిన నిధులు పాత అప్పులకు కూడా సరిపోవని అన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం నూతన విబి - జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ను కొనసాగించాలని నర్సింహ డిమాండ్ చేసినారు.  ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా, మండల అధ్యక్షులు బొల్లెపల్లి కిషన్, మండల నాయకులు ఏదునూరు వెంకటేష్ తో పాటు గ్రామానికి సంబంధించిన కడారి కృష్ణ , మైలారం శివ, ఎండి. రఫీక్, తూముకుంట వెంకటేష్, పన్నాల నరేందర్ రెడ్డి, బొల్లెపల్లి రమ్య, బొల్లెపల్లి సోనీ, బొల్లెపల్లి కల్పన, బొల్లెపల్లి అనిత, జనగాం సుమలత, ఏదునూరి సోనీ, మావురం భారతమ్మ, గోసన విజయ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పీఠం కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్ పోటా పోటీ




నేరేడుచర్ల మున్సిపాలిటీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. చైర్మన్ పీఠమే లక్ష్యంగా హేమాహేమీలు పావులు కదుపుతుండటంతో పట్టణ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. పురపాలికలో ఎవరు గెలుస్తారో ఎవరికి మున్సిపల్ పీఠం వరిస్తుందో అని పుర ప్రజలు జోరుగా చర్చించుకుంటున్నారు. నేరేడుచర్ల మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. నేరేడుచర్ల మున్సిపల్ స్థానాన్ని జనరల్ రిజర్వేషన్ గా ప్రకటించడంతో గట్టి పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో నేరేడుచర్లలో మొత్తం 15 స్థానాలకు గాను కేవలం మూడు స్థానాలే జనరల్  రిజర్వేషన్ రాగా మూడు స్థానాలు గట్టి పోటీ నెలకొంది. టిఆర్ఎస్ పార్టీ నుంచి చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న దొండపాటి అప్పిరెడ్డి మూడవ వార్డు నుంచి పోటీకి నిలబడగా గెలుపు సునాయాసమే అనుకున్న ప్రస్తుతం అదే  ఎక్కువగా ఉండి గత పాలక మండలి లో రెండు సంవత్సరాలు చైర్మన్ అభ్యర్థిగా ఉన్న బచ్చలకూరి ప్రకాష్ మంత్రి ఉత్తమ్ ఆశీస్సులతో బరిలోకి దిగుతుండగా పోటీ రసవత్తమైంది. దఅప్పిరెడ్డి సామాజిక వర్గం రెడ్డి కాగా , ప్రకాష్ దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడు దీనికి తోడు సామ్యూడిగా గతంలో చేసిన పనులకు గుర్తింపు గల నేతగా ఉండడంతో గట్టి పోటీ ఉండదనుకున్న స్థానంలో సైతం టిఆర్ఎస్ కు కష్టకాలం ఎదురుగా పోతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..




## టీవీకే ప్రారంభమైంది కన్నీళ్లను తుడవడానికే..

టీవీకే చీఫ్, నటుడు విజయ్ మరోసారి అధికార ద్రవిడ మున్నేట్ర కజగం దాని ప్రత్యర్థి లను లక్ష్యంగా చేసుకున్నారు. సోమవారం ఆయన రాష్ట్ర రాజకీయ ప్రముఖులపై తీవ్ర స్థాయిలో దాడి చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పార్టీని తన రాజకీయ శత్రువుగా ఆయన అభివర్ణించారు. అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఆ రోజు, ఆ కన్నీళ్లను తుడవడానికి ూ×ూణవీఖ ప్రారంభమైంది. అదేవిధంగా, 2021 ఎన్నికల తర్వాత, కామరాజర్ (కె. కామరాజ్, స్వాతంత్ర్య సమరయోధుడు, మద్రాస్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి), అన్నా కూర్చున్న చోట ఇలాంటి వ్యక్తి కూర్చున్నాడని భావించి ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు" అని విజయ్ పేర్కొన్నారు. టీవీకే ప్రారంభమైంది ఆ కన్నీళ్లను తుడవడానికే. మీరు (దాని ప్రేక్షకులు), కోట్లాది మంది ప్రజల వల్లే మా పార్టీ తమిళనాడులో అతిపెద్ద పార్టీగా అవతరించిందని ఆయన అన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా ఎంజీఆర్‌ను తక్కువ అంచనా వేశారని, తనకు రాజకీయ అనుభవం లేదని ప్రశ్నించిన విమర్శకులకు కూడా ఆయన సమాధానమిచ్చారు. "ఇది వారి (డిఎంకె ప్రతినిధులు టికెఎస్ ఎలంగోవన్, శరవణన్ విజయ్‌ను వారాంతపు రాజకీయ నాయకుడిగా అభివర్ణించారు. (గ్రౌండ్ లెవల్ రాజకీయాల సూక్ష్మ నైపుణ్యాల గురించి ఆయనకు తెలియదని చెప్పారు) పని. ఇప్పుడు వారు నా అనుభవాన్ని ప్రశ్నిస్తున్నారు" అని విజయ్ అన్నారు. తన పార్టీ స్థాపించి మూడో వార్షికోత్సవం సందర్భంగా, విజయ్ 1977లో ఇచ్చిన రేడియో ఇంటర్వ్యూను ప్రస్తావించారు. ఆ ఇంటర్వ్యూలో రాజకీయాల్లోకి రాకముందు అత్యంత విజయవంతమైన నటుడు అయిన ఎంజిఆర్, అన్నాకు అనర్హులైన వారసుల గురించి, అంటే డిఎంకెను స్థాపించిన రాజకీయ దిగ్గజం సిఎన్ అన్నాదురై గురించి తాను కన్నీళ్లు పెట్టుకున్నానని అన్నారు. విజయ్ అనుభవాన్ని ప్రశ్నించిన నోళ్లు అప్పుడు విమర్శించాయి.. అని విజయ్ ఐవీఖ పై విమర్శలు గుప్పించారు. కాబట్టి మమ్మల్ని ఎవరు విమర్శించినా.. వారు వీ+= ని, కామరాజర్ ని కూడా ప్రశ్నించినట్లే అని విజయ్ తెలిపారు.

## బీజేపీ ఏజెంట్‌గా సీఈసీ

**జ్ఞానేశ్‌కుమార్ అహంకారి**

**పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఎన్నికల కమిషన్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రత్యేక సమగ్ర సమీక్ష (సర్) సందర్భంగా భారీస్థాయిలో ఓటర్ల తొలగింపు జరిగిందని ఆరోపిస్తూ సోమవారం ఇక్కడి ఈసీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ఏజెంట్‌లా ఎన్నికల కమిషన్ పనిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్‌లోని సర్ బాధితులను వెంటపెట్టుకుని సీఈసీని కలసిన మమత చిన్న చిన్న అక్షర దోషాలు, ఇంటిపేర్ల మార్పులను సాకుగా చూపించి ఓటర్ల వాదనను కూడా పట్టించుకోకుండా పేర్లను తొలగించడంపై అభ్యంతరం తెలిపారు. ఎన్నికల కమిషనర్ బీజేపీ ఐటీ సెల్ మనిషి. దీన్ని ప్రజాస్వామ్యం అంటారా? అంటూ ఆమె మండిపడ్డారు. విచారణ జరపకుండా 58 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆమె ఆరోపించారు. సీఈసీతో సమావేశాన్ని చివరన బహిష్కరించినట్లు ఆమె తెలిపారు. జ్ఞానేశ్‌కుమార్ అహంకారి, అబద్ధాలకోరు అని మండిపడ్డారు. తమను అవమానించారని ఆమె ఆరోపించారు.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు జైలు శిక్ష

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. రెండు వేర్వేరు అవినీతి కేసుల్లో ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు జైలు శిక్ష విధించింది. రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్టుకు సంబంధం ఉన్న ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి షేక్ హసీనాతో పాటు ఆమె బంధువులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢాకాలోని కోర్టు-4కు చెందిన ప్రత్యేక జడ్జి రాబిల్ ఆలమ్ ఈ కేసులో తీర్పును వెలువరించారు. షేక్ హసీనాకు ఒక్కో కేసులో ఐదేళ్ల చొప్పున మొత్తం పదేళ్ల జైలు శిక్ష విధించారు. షేక్ హసీనా మేనల్లుడు రద్వాన్ ముజిబ్ సిద్ధిక్, మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్ధిక్, అజ్మినా సిద్ధిక్‌లకు కూడా ఈ అవినీతి కేసుల్లో శిక్ష పడింది. ముజిబ్ సిద్ధిక్‌కు నాలుగేళ్లు, మేనకోడళ్లకు ఏడేళ్ల చొప్పున శిక్ష విధించారు. రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్టు కేసులో సరెండర్ అయిన ఖుర్షీద్ ఆలమ్‌కు ఏడాది జైలు శిక్ష విధించారు. నిందితులందరికీ జరిమానా కూడా విధించారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా ఆరు నెలలు జైలు జీవితాన్ని అనుభవించాలని ఆదేశించారు.

# రగులుతున్న బలూచిస్థాన్



న్యూఢిల్లీ: బలూచిస్థాన్‌లో పెరిగిపోతున్న హింస పాకిస్థాన్‌లోని తాజా పరిస్థితిని ప్రతిబింబిస్తూ భద్రతా సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) తన ఆపరేషన్ హెరోఫ్ ద్వారా సైన్యంపై దాడులు తీవ్రతరం చేస్తూ పాక్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తున్నది. ప్రధాన పట్టణాల నుంచి మారుమూల గ్రామాల వరకు బీఎల్ఏ తన ఆపరేషన్ హెరోఫ్ 2.0 దశలో భాగంగా ఆత్మాహుతి దాడులు, కాల్పుల పోరుతో బీభత్సం సృష్టిస్తున్నది. డజన్ల సంఖ్యలో పౌరులు, భద్రతా సిబ్బంది మరణించారని, గతంలో ఎన్నడూ లేని స్థాయిలో తీవ్రవాదుల అణచివేత ఆపరేషన్ జరుగుతున్నదని పాకిస్థానీ అధికారులు చెబుతున్నారు. గడచిన 48 గంటల్లో 177 మంది తీవ్రవాదులను మట్టుపెట్టినట్లు వారు తెలిపారు. అయితే బీఎల్ఏ ఈ వాదనను తోసిపుచ్చింది. తాము జరిపిన దాడుల్లో సుమారు 200 మంది పాక్ సైనికులు మరణించినట్లు తెలిపింది. బలూచిస్థాన్ తిరుగుబాటు పాక్ ప్రభుత్వానికి భద్రతాపరంగా, ఆర్థికంగా, విదేశాంగ విధానం పరంగా తలనొప్పిగా మారింది. గ్వదర్ పోర్టు ద్వారా బెల్ట్ అండ్ రోడ్డు ప్రాజెక్టు చేపట్టాలని ఆశిస్తున్న చైనాకు బలూచిస్థాన్ ప్రావిన్సు ప్రతిబంధకంగా మారింది. రేకో డిఖ్ వద్ద అపార ఖనిజ నిక్షేపాలు ఉన్న బలూచ్, ఇరాన్, అఫ్ఘానిస్థాన్‌కు సరిహద్దున ఉండడంతో భద్రతాపరంగా పాక్‌కు కీలకంగా మారింది. బలూచ్‌లో తాజాగా జరిగిన మహిళా ఆత్మాహుతి బాంబర్ల దాడులు పాకిస్థాన్‌కు చెందిన విలువైన ఖనిజ నిక్షేపాల్లో పెట్టుబడి పెట్టాలని ఆసక్తిగా ఉన్న వారందరికీ హెచ్చరిక లాంటిదని రాజకీయ విశ్లేషకుడు మైఖేల్ కుగెల్మాన్ వ్యాఖ్యానించారు. ఖనిజ నిక్షేపాలు ఉన్న ప్రాంతంలోనే ప్రస్తుతం హింస ప్రజ్వరిల్లిందని, స్థానిక వనరులను వెలుపలి శక్తులు దోచుకుంటున్నాయనే కోపమే బలూచ్ పౌరుల తిరుగుబాటుకు ప్రధాన కారణమని ఆయన తెలిపారు. మొట్టమొదటిసారి పురుషులతోపాటు మహిళలు కూడా బీఎల్ఏ పోరాటంలో భాగస్వాములయ్యారు. 800 నుంచి 1,000 మంది మహిళలు ఈ పోరాటంలో ఉండవచ్చుని, వారికి నెలల తరబడి శిక్షణ ఇచ్చి ఉంటారని ఓ నిఘా అధికారి తెలిపారు. పాకిస్థాన్ ఈ తిరుగుబాటును కేవలం భద్రతాపరంగా మాత్రమే చూడడం లేదు. బీజింగ్‌తో సంబంధాలు, పెట్టుబడిదారుల విశ్వాసం వంటి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని బలూచ్ తీవ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని భావిస్తున్నది.

# 56 అంగుళాల ఛాతికి ఏమైంది?

**ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ చురకలు**

న్యూఢిల్లీ: భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణే అముద్రిత పుస్తకం ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీని ఉటంకిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం సోమవారం లోక్‌సభలో తీవ్ర రభసకు దారితీసింది. భారత సరిహద్దు డోక్లాం సమీపానికి చైనా యుద్ధ ట్యాంకులు ప్రవేశించినట్లు రాహుల్ చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపాయి. చైనా మనతో ఘర్షణకు దిగినపుడు 56 అంగుళాల ఛాతి ఏమైంది? అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలతో అధికార పక్షం నుంచి తీవ్ర నిరసనలు వెలువడ్డాయి. రాహుల్ ప్రసంగాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తర్వాత హోంమంత్రి అమిత్ షా అడ్డుకున్నారు. పార్లమెంటరీ నిబంధనలను ఉటంకిస్తూ స్పీకర్ ఓం బిర్లా సైతం రాహుల్‌ను నిలువరించారు. తనను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారని రాహుల్ అభ్యంతరం తెలిపారు. నిజాలు బయటకు వస్తాయేమోనని వారు (ప్రభుత్వం) భయపడుతున్నారు మోదీ, రాజ్‌నాథ్ గురించి వాస్తవాలు ప్రజలకు వెల్లడిస్తాం. చైనా మనతో ఘర్షణకు దిగడానికి ముందుకు చొచ్చుకువస్తుంటే 56 అంగుళాల ఛాతికి ఏమైంది? అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని, లోక్‌సభలో చర్చకు ఆయనే నాయకత్వం వహించాలని రాహుల్ డిమాండ్ చేశారు. దాదాపు 46 నిమిషాలపాటు రాహుల్ నరవణే పుస్తకంపై మాట్లాడేందుకు ప్రయత్నించగా స్పీకర్ అడ్డుకుంటూ సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదావేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత రాహుల్ మళ్లీ ప్రసంగించేందుకు ఉపక్రమించగా సభలో గందరగోళ వాతావరణం నెలకొనడంతో స్పీకర్ సభను మంగళ



వారానికి వాయిదా వేశారు.

## రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ప్రభుత్వం అతిగా స్పందించింది: శశిథరూర్

డొక్లామ్ అంశంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో ప్రభుత్వం తరఫున అతిగా స్పందించారని కాంగ్రెస్ పార్టీ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ అన్నారు. రాహుల్ గాంధీ లేవనెత్తాలని ప్రయత్నించిన అంశాలు ప్రజలకు తెలిసిన విషయాలేనని అన్నారు. పార్లమెంటు వెలుపల శశిథరూర్ విలేకరులతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఒక మ్యాగజైన్‌లో ప్రచురితమైన కథనం ఆధారంగా మాట్లాడారని అన్నారు. సంబంధిత పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని ప్రభుత్వం అభ్యంతరం చెప్పే బదులు ఆయనకు మాట్లాడే అవకాశం ఇచ్చి ఉండే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఆ మ్యాగజైన్ ఎప్పుడైనా బయటకు వస్తుందని అన్నారు. అది బయటకు వస్తే ఎవరైనా చదవవచ్చని అన్నారు. నేను ఆ మ్యాగజైన్‌లోని అంశాలను ఇప్పుడే చదివానని, ఇతరులు కూడా చదువుతారని వ్యాఖ్యానించారు. కాగా, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే రాసిన పుస్తకంలోని అంశాలను రాహుల్ గాంధీ ఉటంకించడానికి ప్రయత్నించడంతో లోక్‌సభలో అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే.



## కుట్ర కోణం ఉందంటున్న కాంగ్రెస్, శివసేన నేతలు!

**అజిత్ పవార్ మృతిపై తీవ్రమవుతున్న రాజకీయ దుమారం**

**విమాన ప్రమాదంపై కాంగ్రెస్, శివసేన (యూబీటీ) అనుమానాలు**

**చివరి నిమిషంలో పైలట్‌ను మార్చడంపై ప్రతిపక్షాల ప్రశ్నలు**

**ఎన్సీపీ వర్గాల విలీనంపై ఒత్తిడి వల్లే ఇదంతా జరిగిందని ఆరోపణలు**

**ఆరోపణలను ఖండించిన బీజేపీ, రాజకీయం చేయొద్దని హితవు**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటన అనూహ్య మలుపు తీసుకుంది. ఇది కేవలం ప్రమాదం కాదని, దీని వెనుక కుట్ర దాగి ఉందని ప్రతిపక్ష కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీలు సంచలన ఆరోపణలు చేయడంతో రాజకీయ దుమారం రేగింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని ఆ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేత విజయ్ వడేటివార్ మాట్లాడుతూ, "మహారాష్ట్రలో 80 శాతం మంది ప్రజలు ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదానికి ముందు, చివరి నిమిషంలో పైలట్‌ను ఎందుకు మార్చారు? విమానంలో ఆరుగురు ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం ఉంటే, ఐదు మృతదేహాలే ఎందుకు లభించాయి?" అని తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు. కేవలం సీఐడీ విచారణతో నిజాలు బయటకు రావని, నిష్పక్షపాత దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా ఇదే తరహా అనుమానాలు వ్యక్తం చేశారు. అజిత్ పవార్ తన వర్గాన్ని, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గాన్ని తిరిగి ఏకం చేసేందుకు ప్రయత్నించారని, ఈ కారణంగానే మహాకూటమిలో ఆయనపై తీవ్ర ఒత్తిడి వచ్చిందని ఆరోపించారు. ఇరిగేషన్ స్కాం ఫైళ్లను అడ్డం పెట్టుకుని బీజేపీ ఆయన్ను బెదిరించిందని అన్నారు. పార్టీలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్న కొద్ది రోజులకే ఆయన మరణించడం మిస్టరీగా ఉందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని రౌత్ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇవన్నీ నిరాధారమైనవని, ఒకరి మరణంపై రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూడటం దారుణమని బీజేపీ ఎమ్మెల్సీ చిత్ర వాఘ్ విమర్శించారు. అజిత్ పవార్‌పై పాలక కూటమి నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని ఆమె స్పష్టం చేశారు. కాగా, అజిత్ పవార్ బీజేపీని వీడటానికి సిద్ధమైన కొద్ది రోజులకే ఈ ప్రమాదం జరిగిందంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొలుత అనుమానాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# నా పెళ్లిపై అసత్య ప్రచారలెందుకు?


## నటి మెహరిన్ ఘాటు వ్యాఖ్యలు

తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరిన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు.



# చతికిలపడుతున్న తమిళ సీనియర్ హీరోలు.. సిమ్రాన్ కామెంట్ నిజమే

సినిమా అనే ప్రపంచంలో ఎప్పుడూ రేసు కొనసాగుతూనే ఉంటుంది. ఇక్కడ ఎవరు ఎలాంటి కథలతో చిత్రాలు చేసినా అంతిమ లక్ష్యం విజయం సాధించడమే. తద్వారా ఆర్థికపరమైన లాభాలు ప్రధానాంశంగా మారతాయి. సినిమా శతాబ్ది వేడుకను జరుపుకున్నా ఇప్పటికీ ఈ ఫార్ములాలో ఎలాంటి మార్పులేదు. ఉండదు కూడా. వైవిధ్యం అనేది దర్శకుడి సృజనాత్మకతపైనే ఆధారపడి ఉంటుంది. అదేవిధంగా ఇప్పుడు ప్రేక్షకులు మోనాటమిని అసలు ఇష్టపడడం లేదు. అది ఏ సూపర్‌స్టార్ హీరోగా నటించినా నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టేస్తున్నారు. ప్రస్తుతం కోలీవుడ్ సీనియర్ హీరోల సినిమాలకు గడ్డుకాలం ఏర్పడింది. ఇందుకు చిన్న ఉదాహరణ ఇటీవల రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన వేట్టయన్, కూలీ మూవీతో పాటు కమలహాసన్ నటించిన థగ్ లైఫ్, విజయ్ నటించిన లియో, గోట్, అజిత్ నటించిన విడాముయర్చి , సూర్య నటించిన రెట్రో, కంగువ వంటి చిత్రాలే. అదేవిధంగా జయాపజయాలు ఎవరి చేతిలోనూ ఉండవన్నది జగమెరిగిన సత్యం. సినిమా, జయాపజయాలు అన్నవి నిరంత ప్రక్రియ.






# ఇరవై ఏండ్లు గుర్తుండిపోవాలి


'ఈ సినిమాలో నేను మూడు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తా. ఈ కథ ఇరవై ఏళ్ల పాటు గుర్తుండిపోవాలనే తపనతో పనిచేశాను. నా మనసుకు నచ్చిన గొప్ప కథ ఇది' అన్నారు సంతోష్ శోభన్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మిస్తున్నది. మానస వారణాసి కథానాయిక. నిర్మాత ధీరజ్ మొగిలినేని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. సోమవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఫీల్‌గుడ్ రొమాంటిక్ మూవీ ఇదని దర్శకుడు తెలిపారు. ఈ సినిమా చూసిన అనుభూతిలో చాలా రోజులు ఉండిపోయానని, ఎన్నో ప్రేమకథలు చూస్తుంటాం కానీ ఇదొక విభిన్నమైన కాన్సెప్ట్ అని ధీరజ్ మొగిలినేని చెప్పారు. ఈ సినిమాలో తాను మిత్ర అనే ధైర్యవంతురాలైన అమ్మాయిగా కనిపిస్తానని, చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే క్యూట్ లవ్‌స్టోరీ ఇదని కథానాయిక మానస వారణాసి చెప్పింది. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: ఆదిత్య రవీంద్రన్, రచన-దర్శకత్వం: అశ్విన్ చంద్రశేఖర్

# 'మార్కో' దర్శకుడితో సినిమా?

తెలుగు సినీరంగంలో ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ తెరమీదకు రాబోతున్నట్లు సమాచారం. 'మార్కో' వంటి వయొలెంట్ సినిమాతో ఒక్కసారిగా దక్షిణాది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు మలయాళీ దర్శకుడు హనీఫ్ అదేని. విపరీతమైన హింస, రక్తపాతం ఉందంటూ విమర్శలు ఎదుర్కొన్నప్పటికై.. స్టైలిష్ మేకింగ్, డిఫరెంట్ ప్రజెంటేషన్‌తో ఈ సినిమా టార్గెటెడ్ ఆడియెన్స్‌ని మెప్పించింది. తాజాగా దర్శకుడు హనీష్ అదేని తెలుగులో బాలకృష్ణ కథానాయకుడిగా ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారనే వార్త టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ చిత్రాన్ని అగ్ర నిర్మాత దిల్ రాజు తెరకెక్కించబోతున్నారని, త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని సమాచారం. ఈ సరికొత్త కాంబో తాలూకు వార్తలతో బాలకృష్ణ అభిమానులు హ్యాపీగా ఫీలవుతున్నారు. హనీఫ్ అదేనై స్టైలిష్ మేకింగ్, బాలకృష్ణ పవర్‌ఫుల్ పర్‌ఫార్మెన్స్ కలిస్తే గూజ్‌బంప్స్ ఖాయమని అంటున్నారు. మరి ఈ సినిమా తాలూకు వార్తల్లో నిజమెంతుందో తెలియాలాంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు.



# శివ రాజ్‌కుమార్, ఉపేంద్రల మల్టీస్టారర్ చిత్రం '45'.




కన్నడ అగ్ర నటులు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం '45'. ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ఉపేంద్రతో పాటు రాజ్ బి. శెట్టి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. సినిమా విభిన్నమైన కథాంశంతో, ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ కు అధిక ప్రాధాన్యం ఇస్తూ రూపొందినట్టు స్పష్టమవుతోంది. ఉపేంద్ర తన గత చిత్రాల మాదిరిగానే ఇందులోనూ ఒక డిఫరెంట్, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నట్లు సమాచారం.